# అంధకారంలో పుర కాలనీలు

- ఏడాదిగా వీధి దీపాల నిర్వహణ గాలికి
- కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బకాయిలు రూ.3.40 కోట్లు
- నిధులు లేవంటున్న బల్దియా అధికారులు



అంధకారంలో కామారెడ్డి మున్సిపాలిటీలోని కల్కినగర్

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి మున్సిపాలిటీలో వీధి దీపాల నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలోని పలు కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. వీధిదీపాల నిర్వహణకు చెల్లించాల్సిన బిల్లులు మూడున్నరేళ్లుగా చెల్లింపులు జరపకపోవడంతో ఆ కాంట్రాక్టర్‌ పట్టించుకోవడం లేదు. నెల..రెండు నెలలు కాదు.. ఏకంగా ఏడాదికి పైగా పట్టణంలో వీధి దీపాల నిర్వహణను అధికారులు, కాంట్రాక్టర్‌లు కలిసి పూర్తిగా గాలికి వదిలేశారు. ఇప్పటికే బల్దియా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది.

**ప్రతి నెలా నిర్వహణకు రూ.10 లక్షలు..**

కామారెడ్డి మున్సిపల్‌లో 49 వార్డులు, సుమారు 500లకుపైగా కాలనీలు, 25 వేల గృహాలు, లక్షకు పైగా జనాభా ఉన్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లపై సెంట్రల్‌ డివైడర్‌లలో ఏర్పాటు చేసిన 890 విద్యుత్‌ దీపాల నిర్వహణ బల్దియానే చూసుకుంటుంది. అలాగే వార్డులలోని కాలనీలలో 12,434 వీధి దీపాలు ఉండగా వీటి నిర్వహణ ఈఎస్‌ఎస్‌ అనే కంపెనీ టెండర్‌ దక్కించుకుంది. ప్రతి నెలా వీటి నిర్వహణకు రూ.10 లక్షలకు పైగా ఆ కంపెనీ కాంట్రాక్టర్‌కు బల్దియా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. మూడున్నరేళ్లుగా సుమారు రూ.3.40 కోట్లు బకాయిలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో ఆ కాంట్రాక్టర్‌ వీధి దీపాల నిర్వహణకు గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో చాలా కాలనీలలో వీధి దీపాలు చెడిపోగా, కొన్ని చోట్ల ఎల్‌ఈడీ దీపాలు వెలగడం లేదు. శివారు కాలనీలలో అంధకారం నెలకొనడంతో దొంగతనాలు జరుగుతున్నాయి. బిల్లులు చెల్లిస్తేనే స్పందిస్తానని కాంట్రాక్టర్‌, అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. నిధులు లేక చేసేదేమీ లేక అధికారులు చేతులెత్తేశారు.

**ట్రాన్స్‌కోకు రూ.23కోట్ల బకాయిలు**

ఎన్‌పీడీసీఎస్‌లకు రూ.23కోట్లకు పైగా బకాయిలు కామారెడ్డి బల్దియా చెల్లించాల్సి ఉంది. గతంలో విద్యుత్‌ శాఖ.. బల్దియా కార్యాలయానికి, సెంట్రల్‌ లైటింగ్‌లకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేసిన ఘటనలున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే ఈ బిల్లులు చెల్లించే పరిస్థితులున్నాయి. లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

**త్వరలో బకాయిలు చెల్లిస్తాం**

పట్టణంలో వీధి దీపాల నిర్వహణ కంపెనీకి రూ.3 కోట్లకు పైగా బకాయిలు ఉండటం వాస్తవమే. నిధులు లేక చెల్లించలేకపోతున్నాం. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. త్వరలోనే బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌, కామారెడ్డి

## క్లుప్తంగా

### ప్రతి ఒక్కరూ దేశభక్తి చాటాలి



ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో కల్నల్‌ విష్ణు పి నాయర్‌

కామారెడ్డి టౌన్‌: ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలని ఎన్‌సీసీ సీవో లుటినెంట్‌ కల్నల్‌ విష్ణు పి నాయర్‌ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి ఎన్‌సీసీ బ్యాచ్‌ స్పెషల్‌ మీటింగ్‌ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఎన్‌సీసీతో కూడా మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌ పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థి శ్రీకాంత్‌ను సన్మానించారు. కళాశాల సీఈవో జైపాల్‌ రెడ్డి, చైర్మన్‌ భాస్కర్‌రావు, ప్రిన్సిపల్స్‌ సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

### విద్యా శాఖ మంత్రిని నియమించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత సురేశ్‌

కామారెడ్డి టౌన్‌: తెలంగాణకు విద్యా శాఖ మంత్రిని తక్షణమే నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మాట్లాడారు. విద్యా రంగాన్ని కాంగ్రెస్‌ ప్రభుత్వం విస్మరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌ నిధులు విడుదల చేయాలన్నారు. నేతలు సతీష్‌, శ్రీకాంత్‌, రాకేష్‌ తదితరులున్నారు.

### ‘వ్యక్తిత్వ వికాసం- సమాహారం’ మెటీరియల్‌ అందజేత

కామారెడ్డి అర్బన్‌: ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని అడివి లింగాలకు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణులు జి.వాయునందన్‌రెడ్డి రూపొందించిన ‘వ్యక్తిత్వ వికాసం–సమాహారం’ రచనను కామారెడ్డి ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల ప్రిన్సిపల్‌ విజయ్‌కుమార్‌కు అందజేశారు. అకడమిక్‌ సమన్వయకర్త విశ్వప్రసాద్‌, ఇన్‌చార్జి పీడీ జి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### డ్రెయినేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మహేశ్‌ గౌడ్‌

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగులో అండర్‌ గ్రౌండ్‌ డ్రెయినేజీ పనులను గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో రెండు కిలోమీటర్ల మేర ఇరువైపులా అండర్‌ గ్రౌండ్‌ డ్రెయినేజీ నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. గత కాంట్రాక్టర్‌ డ్రెయినేజీ పనులు చేయకుండానే నిలిపివేశారు. దాంతో గ్రామంలో డ్రెయినేజీ లేక చెత్తా చెదారం పేరుకుపోయింది. ఈ విషయం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించి..కాంట్రాక్టరుతో మాట్లాడి డ్రైనేజీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. నేతలు ప్రవీణ్‌, ప్రశాంత్‌, సాయిలు, సతీష్‌ పాల్గొన్నారు.

### జంగమాయిపల్లిలో జీపీ భవన పనులు..



భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్‌ రజిత

ఎల్లారెడ్డి: జంగమాయిపల్లిలో బుధవారం జీపీ భవన నిర్మాణ పనులకు ఏఎంసీ చైర్‌పర్సన్‌ రజిత భూమి పూజ చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న జీపీ భవనానికి కొబ్బరి కాయ కొట్టి పనులను ఆమె ప్రారంభించారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగ్రెస్‌ నాయకులు వెంకట్రాం రెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.

### పూజారిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న బ్రాహ్మణ వికాస పరిషత్‌ సంఘం నాయకులు

ఎల్లారెడ్డిరూరల్‌: చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి సౌందర్య రాజన్‌పై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎల్లారెడ్డి బ్రాహ్మణ వికాస పరిషత్‌ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బుధవారం ఎల్లారెడ్డిలో బ్రాహ్మణ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీధర్‌, రాజేశ్వరశర్మ, శ్రీనివాస్‌, ప్రణయ్‌, నర్సింహారావు, నారాయణ, భీంరావు తదితరులున్నారు.

## టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన



బీబీపేట బాలుర పాఠశాలలో విద్యార్థులకు వివరిస్తున్న సీఈవో మధులాశ్‌ బాబు

బీబీపేట : మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్‌ కలాం ఆశయాలు, కలలను సాకారం చేసేందుకు అబ్దుల్‌ కలాం యాత్ర పేరిట రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో ఒక పాఠశాలను ఎంపిక చేసి ఆ పాఠశాలకు ఈ ఫ్లో బస్సు వస్తుంది. దీన్ని ల్యాబ్‌ ఆన్‌ వీల్స్‌గా పిలుస్తారు. యాత్రలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు యాత్ర సిబ్బంది మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాత్ర సీఈవో మధులాశ్‌ బాబు టెక్నాలజీ గురించి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రస్తుతం విద్యార్థుల్లో ఉన్న శాస్త్ర, సాంకేతికతను వెలికితీయడమే యాత్ర ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా లాట్‌, ఏఆర్‌/వీఆర్‌, రోబోటిక్స్‌, 3డీ ప్రింటింగ్‌, ఏఐ, ఎంఎల్‌ వంటి అనేక ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించేలా ఈ యాత్ర ఉపయోగపడుతుందని యాత్ర సభ్యులు అర్చన, శ్రీజ, సాయి సుబ్రహ్మణ్యం, రోహిత్‌, అజయ్‌, పైలెట్‌ రమేశ్‌ తదితరులు పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, జిల్లా సైన్స్‌ అధికారి సిద్దరాం రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**16న టీజీ గురుకుల మోడల్‌ టెస్ట్‌**

బాన్సువాడ : టీజీ గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 16న మోడల్‌ టెస్ట్‌ నిర్వహించనున్నట్లు ఏఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ నాయకులు రాజారామ్‌ తెలిపారు. బుధవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. బాన్సువాడలోని సాయికీర్తి జూనియర్‌ కళాశాలలో మోడల్‌ టెస్ట్‌ ఉంటుందని అన్నారు. పూర్తి వివరాలకు 7386965601ను సంప్రదించాలని సూచించారు. ఏఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్‌, సభ్యులు సాయికుమార్‌, పర్వయ్య ఉన్నారు.

**రాజంపేటలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పర్యటన**

రాజంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే మదన్‌ మోహన్‌ పర్యటించనున్నట్లు మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎర్ర ప్రణీత్‌ రెడ్డి తెలిపారు. కామారెడ్డి నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆయా గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించనున్నట్లు తెలిపారు.

**సెల్‌ఫోన్‌ అప్పగింత**



నిజాంసాగర్‌(జుక్కల్‌): మండల కేంద్రానికి చెందిన మచ్కూరి పండరి గతేడాది డిసెంబర్‌ 13 న సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు జుక్కల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్‌ ద్వారా సెల్‌ఫోన్‌ గుర్తించారు. బుధవారం జుక్కల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఎస్సై భువనేశ్వర్‌, పండరీకి సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

**సర్దాపూర్‌ తండాలో వైద్య శిబిరం**

మాచారెడ్డి: సర్దాపూర్‌ తండాలో బుధవారం మాచారెడ్డి వైద్యాధికారి ఆదర్శ్‌ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 41 మందిని పరీక్షించి రక్తనమూనాలను ల్యాబ్‌కు పంపించారు. సీజన్‌ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కల్పించారు. జిల్లా వైద్యులు రాధిక, మౌనిక, సీహెచ్‌వో వెంకటేశ్వర్‌ రావు ఉన్నారు.

**భిక్కనూరు పీహెచ్‌సీలో..**

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. కంటి వైద్యుడు రవీందర్‌ పటేల్‌ 122 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు.

**ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపి క్యాంపు**

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్‌ వైద్య పరీక్షలు చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

**ఆర్థిక సహాయం అందజేత**

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి జీపీ కార్యాలయంలో కార్మికుడిగా పనిచేసిన కీసరి మైశయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు ఎంపీవో సవితారెడ్డి తెలిపారు. ఈ నెల 11న తాడ్వాయి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకస్మాత్తుగా మైశయ్య మృతిచెందాడని, ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల నగదును అందజేసినట్లు తెలిపారు. అలాగే జీపీలో పనిచేయడానికి ఆ కుటుంబ సభ్యుల్లో ఒకరిని తీసుకుంటామన్నారు. జీపీ కార్యదర్శి బాలు, కారోబారు స్వామి, ఉన్నారు.

**పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు**

కామారెడ్డి రూరల్‌: చిన్నమల్లారెడ్డిలో బుధవారం పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామంలోని పొలాల వద్దకు వెళ్లి పంటల పూర్తి వివరాలను డిజిటలైజేషన్‌ చేసినట్లు తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ**

కామారెడ్డి టౌన్‌: కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు నయీమ్‌ జన్మదినం సందర్భంగా జిల్లా కాంగ్రెస్‌ నాయకుడు చందు బుధవారం మున్సిపల్‌ పరిధిలో 34వ వార్డు దేవునిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బీరువా వితరణ చేశారు. పార్టీ సీనియర్‌ నాయకుడు లక్ష్మీపతి యాదవ్‌, రవి, రాజేష్‌ తదితరులున్నారు.

**వీడీసీ చైర్మన్‌గా సిద్దిరాములు**



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ ఎల్లారెడ్డిలో గ్రామాభివృద్ధి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల సిద్ది రాములు, ఉపాధ్యక్షులుగా గడ్డం అంజనేయులు, భాస్కర్‌, సుధాకర్‌, రంగ మోహన్‌, రెడ్డి మల్లేశ్‌, మహ్మద్‌ యూసుఫ్‌, ప్రధాన కార్యదర్శిగా గంగసాని సాగర్‌ రెడ్డి, సహాయకార్యదర్శులుగా గంగయ్య, ఉమాకాంత్‌ గౌడ్‌, శ్రీనివాస్‌, మహేశ్‌, కోశాధికారిగా సీతగారి రాజయ్య, మరో 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

**మాచాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

ఎల్లారెడ్డిరూరల్‌: మాచాపూర్‌లో రూ.5 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కుడుముల సత్యనారాయణ భూమిపూజ చేసి ప్రారంభించారు. కాంగ్రెస్‌ నాయకులు వెంకట్రాంరెడ్డి, యాదాగౌడ్‌, మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా తదితరులున్నారు.

**బీసీ నాయకుల అరెస్టు**

బిచ్కుంద(జుక్కల్‌): బీసీలకు న్యాయం చేయాలని హైదరాబాద్‌లో చేపట్టనున్న బీసీల గర్జన, సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ముందు జాగ్రత్తగా బుధవారం బిచ్కుందలో పోలీసులు బీసీ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీసీ నేత నాల్చర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ కులగణన తప్పుల తడకగా ఉంది.. జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్‌ ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. జనాభా తక్కువ ఉన్న కొన్ని కులాలకు రాజకీయాల్లో ఎక్కువ అవకాశం కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు విష్ణు, బాలు తదితరులను అరెస్టు చేశారు.

### ఇంటర్‌ప్రాక్టికల్‌ పరీక్షాకేంద్రాల తనిఖీ

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షా కేంద్రాలను బుధవారం జిల్లా నోడల్‌ అధికారి సలాం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, గతంలో కంటే ఈ ఏడాది ప్రాక్టికల్‌ పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయని అన్నారు. ఆయన వెంట ప్రిన్సిపల్‌ అసద్‌, అధ్యాపకులు రఘురాం, అనుపమ తదితరులున్నారు.

### ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న తపస్‌ నేతలు

బాన్సువాడ : స్థానిక సంస్థల ఎన్నికల విధుల నుంచి మహిళా ఉపాధ్యాయులకు, దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని తపస్‌ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం డీపీవోకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సర్వీసు ఆధారంగా డ్యూటీలు వేయాలని విన్నవించారు. తపస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్‌ సంతోష్‌, రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌ కుమార్‌, లక్ష్మణ్‌ ఉన్నారు.

### ‘సీఎంకు రుణపడి ఉంటాం’



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్‌(జుక్కల్‌): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఏ, బీ, సీ కేటగిరీలుగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం హర్షణీయమని జుక్కల్‌ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మాదిగ కులాల నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మాదిగలు, సీఎంకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని చెప్పారు.

### నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

బాన్సువాడ రూరల్‌ : మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో గురువారం ఉపాధిహామీ పనుల ఆడిట్‌పై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బషీరుద్దీన్‌ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రజావేదిక ప్రారంభం అవుతుందన్నారు. ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కూలీలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

### గడువు ముగిసిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు



రాజంపేట : ఫర్టిలైజర్‌ షాపులలో గడువు ముగిసిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారిణి శృతి హెచ్చరించారు. బుధవారం రాజంపేట మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్‌ షాపులను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న మందుల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని, రైతుకు కచ్చితంగా రసీదులు ఇవ్వాలని సూచించారు.

### మానవత్వం చాటిన ప్రభుత్వాస్పత్రి సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రి సిబ్బంది మానవత్వం చాటారు. వారం రోజుల క్రితం ఎల్లారెడ్డిలో మతిస్థిమితం లేక తిరుగుతున్న వృద్ధురాలిని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు ఆస్పత్రి సిబ్బంది వారం రోజులుగా వైద్యం అందించడంతో పాటు ఆహారం తినిపించారు. పూర్తిస్థాయిలో ఆరోగ్యం కుదుటపడిన వృద్ధురాలు.. తన పేరు గంగవ్వ, తనది మెదక్‌ జిల్లా రాజిపేట అని సిబ్బందికి తెలపడంతో ఆమె బంధువులకు సమాచారం అందించినట్లు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌ రవీంద్రమోహన్‌ తెలిపారు. వృద్ధురాలికి సాయం అందించిన సిబ్బందిని అభినందించారు.

## పంచాయతీ ఎన్నికల ప్రక్రియపై అవగాహన



బాన్సువాడలో సూచనలు ఇస్తున్న అధికారులు



హాజరైన అధికారులు



ఎల్లారెడ్డిలో శిక్షణ ఇస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్‌ : మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలపై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో స్టేజ్‌–2 ఎన్నికల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పోలింగ్‌ ప్రక్రియ గురించి వివరించారు. ఎన్నికల నిర్వాహణలో ఎలాంటి తప్పులకు తావులేకుండా, పారదర్శకంగా నిర్వహించడానికి పలు సూచనలు చేశారు. డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో బషీరుద్దీన్‌, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలి**

ఎల్లారెడ్డి : స్థానిక సంస్థల ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల శిక్షణ అధికారులు డీఈవో రాజు, డీఎల్‌పీవో సురేందర్‌లు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని మీసానిపల్లి రైతు వేదికలో ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాలకు చెందిన రిటర్నింగ్‌ ఆఫీసర్‌, అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ ఆఫీసర్‌లకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

**నేడు పోలింగ్‌ కేంద్రాలు, ఓటర్‌ జాబితా డ్రాఫ్టింగ్‌పై సమావేశం**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్‌ కేంద్రాలు, ఓటర్‌ జాబితా డ్రాఫ్టింగ్‌పై గురువారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రభాకరచారి తెలిపారు. ప్రస్తుతం రూపొందించిన జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. మండల పరిషత్‌ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న సమావేశానికి రాజకీయ పార్టీల మండలాధ్యక్షులు హాజరుకావాలని ఆయన కోరారు.

## గర్భం దాల్చని పశువులకు పరీక్షలు చేయించాలి



పాడి రైతులకు మందులు అందజేస్తున్న వైద్యులు

కామారెడ్డి అర్బన్‌ : ఆవులు, గేదెలు కట్టకపోతే వాటికి పరీక్షలు చేయించాలని గర్గుల్‌ పశువైద్యాధికారి రవికిరణ్‌, పాడిరైతులకు సూచించారు. బుధవారం పట్టణ పరిధిలోని అడ్లూర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించి 79 పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పశువులకు లింగ నిర్ధారణ వీర్యం వాడడం వల్ల 90 శాతం ఆడ దూడలు జన్మిస్తున్నాయని, దీనికి రూ.250 చెల్లించాలని, రెండు ఎదలలో గర్భం రాకుంటే రైతు వాటా రూ.500 వాపసు చేస్తారని వివరించారు. రామారెడ్డి వైద్యుడు రాంచందర్‌, డీఎల్‌డీఏ పర్యవేక్షకుడు కృష్ణ, వీఏ మోహన్‌, కార్యదర్శి ప్రసాద్‌, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

**రోగాల బారి నుంచి కాపాడుకోవాలి**

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి) : పశువులను రోగాల బారి నుంచి కాపాడుకోవల్సిన బాధ్యత రైతులపై ఉందని పశువైద్యాధికారి రాంప్రసాద్‌ సూచించారు. బుధవారం లింగంపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనరైతులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి మాజీద్‌, సూపర్‌వైజర్‌ కృష్ణ, ఎల్‌ఎస్‌ఏలు కిశోర్‌, అహల్య, పాల కేంద్రం అధ్యక్షుడు కిషన్‌రావు, కార్యదర్శి ప్రసాద్‌, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

## ఛత్రపతి శోభాయాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న హిందూవాహిని నేత లక్ష్మణ్‌

కామారెడ్డి టౌన్‌ : ఈనెల 19న హిందూ వాహిని ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే ఛత్రపతి శివాజీ జయంతి భారీ శోభాయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం లక్ష్మణ్‌ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌ నుంచి ర్యాలీ ప్రారంభమై పుర వీధుల గుండా దేవునిపల్లి ఆర్యక్షత్రియ సంఘం వరకు సాగుతుందని వివరించారు. ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, హిందూవాహిని తెలంగాణ ప్రాంత సంయోజక్‌ ఉప్పల రాజన్న తదితరులు హాజరవుతారని తెలిపారు. హిందువులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా సంయోజక్‌ సాయికిరణ్‌, నగర సంయోజక్‌ మధన్‌, తదితరులున్నారు.

## విద్యుత్‌ ఉద్యోగుల సంఘం ఆవిర్భావ వేడుకలు



కామారెడ్డిలో వేడుకల్లో పాల్గొన్న విద్యుత్‌ ఉద్యోగులు



ఎల్లారెడ్డిలో జెండాను ఎగురవేస్తున్న నాయకులు



భిక్కనూరులో..

భిక్కనూరు/ఎల్లారెడ్డి/కామారెడ్డిటౌన్‌ : విద్యుత్‌ ఉద్యోగుల సంఘం(1104) 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంతో పాటు భిక్కనూరు, ఎల్లారెడ్డి మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాలను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్‌ ఉద్యోగుల సంక్షేమం కోసం 1104 యూనియన్‌ చేసిన కృషిని, పోరాటాన్ని వివరించారు.

### సేవాలాల్‌ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి



ఢిల్లీలో నిరసనకారులతో వినోద్‌

కామారెడ్డి అర్బన్‌: గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్‌ మహరాజ్‌ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని, లంబాడి భాష గోర్‌బోలిని రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్‌ చేస్తూ న్యూఢిల్లీలోని జంతర్‌ మంతర్‌లో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు. నాయకులు సభావత్‌ వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.